'బడిబాట'ను విజయవంతం చేయాలి

- **జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోశ్**

గద్వాల, జూన్ 7 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలనే సంకల్పంతో ఈ నెల 6నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ ని, అధికారులందరూ నిబద్ధతతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ సంతోశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, వెంకటేశ్వర్లుతో కలిసి సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించా రు. జిల్లాలో పత్తి పొలాల్లో పనిచేసేందుకు ఆగస్టు, సెప్టెంబ ర్, అక్టోబర్ నెలల్లో ఎక్కువ మంది డ్రాప్ అవుట్స్ అవుతుండడంతో చదువులో వెనుకబడుతున్నారన్నారు. బాలకార్మికులు ఎంత మంది ఉన్నారు.. ఎక్కడెక్కడ పని చేస్తున్నారో సంబంధిత అధికారులు వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమయ్యే రోజు నుంచే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, విద్యాశాఖ అధికారి ఇందిర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

అయిజ, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సూచించారు. శుక్రవారం పట్టణంతో పాటు పలుగ్రామాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

అయిజ రూరల్ , జూన్ 7 : మండలంలోని ఆయ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం రెండోరోజు కొనసాగింది. ఇందులో భాగంగా సంకాపురంలో శుక్రవారం హెచ్ఎం కృష్ణ ఇంటింటికీ తిరిగి ప్రతిపిల్లవాన్ని బడికి పంపాలని తల్లిదండ్రులకు వివరించారు.

మల్దకల్‌లో..

మల్దకల్, జూన్ 7 : బడిబాటలో భాగంగా శుక్ర వా రం మండల కేంద్రంతోపాటు బిజ్వారం, ఎల్కూర్, అమరవాయి గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు సురేశ్, నరేశ్, ఉపాధ్యాయులు విజయభాస్కర్ పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు బడులలో చేర్పించాలి

మదనాపురం, జూన్ 7 : సర్కారు బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని దుప్పల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఆంజనేయులు అన్నారు. శుక్రవారం దుప్పల్లిలో ఉ పాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

బడిబాటలో ఇంటింటి సర్వే

పెబ్బేరు, జూన్ 7 : బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. బడిబయట పిల్లలు ఎవరైనా ఉన్నారా, ఐదో తరగతి వరకు ఉత్తీర్ణత సాధించి ఇంటి వద్దే ఎవరైనా ఉంటున్నారన్న వివవరాలు సేకరించారు.

వనపర్తిలో..

వనపర్తి, జూన్ 7 : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులసంఖ్య పెంపుకోసం ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీవో సుదర్శన్ తెలిపారు. మండలంలోని పెద్దగూ డెం గ్రామంలో శు క్రవారం నిర్వహించి న బడిబాట కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

పెద్దగూడెంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాన్‌గల్‌లో..

పాన్‌గల్, జూన్ 7 : బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించడం మనందరి బాధ్యత అని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, హెచ్ఎం వాకిటి రవికుమార్ అన్నారు. మండలంలోని కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లి తండా, అన్నారం, రేమద్దుల గ్రామాల్లో శుక్రవారం విద్యార్థులతో ర్యాలీ చేపట్టి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల కలెక్టర్ సంతోశ్

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

అమరచింత, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మెరుగైన ఉచిత విద్య అందుతుందని ఎంఈవో భాస్కర్‌సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం ఆయన బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పుర వీధుల్లో ర్యాలీ చేపట్టి బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బలరాముడు, ఉపాధ్యాయులు కరుణాకర్, బాలస్వామి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సయ్యద్‌కలాం పాషా, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, బేబమ్మ, వజ్రమ్మ, వెంకటేశ్వరమ్మ, రాధిక ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- ***వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్***

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

వనపర్తి, జూన్ 7 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను నియమనిబంధనలు పాటిస్తూ వందశాతం పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఉదయం 9గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోని అనుమతించాలన్నారు. 9:30గంటల నుంచి బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలన్నారు. పరీక్ష పూర్తి అయ్యేవరకు మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే తప్పా మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏఒక్క అభ్యర్థిని బయటకు పంపడానికి వీలు లేదన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని, అధికారులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించుకోవాలన్నారు. శిక్షణలో రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి ప్రొజెక్టర్ ద్వారా బాధ్యతలు, నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్

- **ఎస్పీ రితిరాజ్**

గద్వాల అర్బన్, జూన్ 7 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీస్‌శాఖ తరపున అన్ని రకాల భద్రతపరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ రితిరాజ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. 105 మంది సిబ్బంది1 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

గద్వాల అర్బన్, జూన్ 7 : ఇటిక్యాల మండలం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే ప్రసాద్ ఈ ఏడాది జనవరిలో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఈ క్రమంలో ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు భద్రత ఎక్స్‌గ్రేషియా నుంచి రూ.8 లక్షల చెక్కు మంజూరు కాగా కార్యాలయ ఏవో సతీశ్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగేంద్ర, సీనియర్ అసిస్టెంట్ వినోద్ తదితరులు ఉన్నారు.

మల్బరీతోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి, జూన్ 7 : జిల్లాలో 40 ఎకరాలలో మల్బరీ తోటల పెంపకానికి సబ్సిడీ కింద రైతులకు అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని, ఆస్తికి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ప్రకటనలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్ తెలిపారు. మల్బరీతోట ఒకసారి వేస్తే 20ఏండ్ల వరకు సాగు చేసుకోవచ్చని, ప్రతి ఏడాది 8నుంచి 10పంటలు తీయవచ్చునని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వ వా టా కింద 65శాతం, రైతు వాటా కింద 35 శాతం మాత్రమే చెల్లించాలన్నారు. మల్బరీ తోట 2 ఎకరాలకు రూ. 78వేలు, నీటి వస తి కోసం రూ.65వేలు, షెడ్లనిర్మాణానికి రూ. 2.92,500 అందజేస్తుందని తెలిపా రు. దీనిలో జనరల్ రైతులకు ప్రభుత్వం వాటాకింద 50శాతం సబ్సిడీ అందిస్తుంద ని, 2ఎకరాల తోటకు రూ.60 వేలు, నీటి వసతికోసం రూ.50వేలు, షెడ్‌కు రూ.2.25 ఉంటుందన్నారు. తోటల పెంపకం కోసం నీటి వసతి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే డ్రిప్, ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు చేసుకొనే అవకాశం కూడా ఉందన్నారు. పూర్తి వివరాల కోసం రైతులు క్షేత్రస్థాయి అధికారులు జనార్దన్ నెంబర్ 9963348275, ఆంజనేయులు నెంబర్ 8465003122ను సంప్రదించాలని సూచించారు

నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు

ఫర్టిలైజర్ షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

- **ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్**

కొత్తకోట, జూన్ 7 : జిల్లాలో రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోస పోవద్దని ఇంచార్జి జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక వ్యవసాయ అధికారులు, టాస్క్ ఫోర్స్ టీం, రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి పట్టణ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఫర్టిలైజర్ షాపు ఎదుట ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో వర్షాకాలం సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏవో షేక్‌మున్నా, డిప్యూటీ తాసీల్దార్ శివ ఉన్నారు.

ఖిల్లాఘనపురం

ఖిల్లాఘణపురం, జూన్ 7 : ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు రైతులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో మల్లయ్య, డీటీ పరమేశ్ హెచ్చరించారు. మండలకేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న విత్తన దుకాణాలను శుక్రవారం వారు తనిఖీలు చేశారు. ముందుగా దుకాణాల్లోని రికార్డులు, నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

గోపాల్‌పేట, జూన్ 7 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో అనిల్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని బుద్దారం, పొల్కెపహాడ్, చాకల్‌పల్లి, ఏదుట్ల గ్రామాల్లో ఏ ఎస్సై రాములు, ఆర్ఐ యాదయ్యతో కలిసి విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

అందుబాటులో వరి విత్తనాలు

పాన్‌గల్, జూన్7: మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు అవసరమయ్యే వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని విండో సీఈవో భాస్కర్ గౌడ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వరి బీపీటీ 25కేజీల బస్తా ధర రూ.1,083, వరి ఆర్ఎన్ఆర్ రకం 25 కేజీల రూ. 1,094 అని తెలిపారు. రైతులు ధ్రువీకరణ పత్రాలు అందజేసి విత్తనాలు పొందవచ్చని సూచించారు.

క్షయవ్యాధిగ్రస్తుల అనుమానిత సర్వే

పాన్‌గల్, జూన్ 7: మండలంలోని కేతేపల్లి, అన్నారం, మాందాపూర్ లో డాక్టర్లు మైథిలి ఆధ్వర్యంలో అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తుల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదిరోజులకు మించి జ్వరం, రెం డు వారాలకు మించి ద గ్గు, రక్తం పడడం, స్వల్ప కాలంలో బరువు తగ్గ డం తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంచందర్ పాల్గొన్నారు.

కొత్తకోటలో భారీ వర్షం

కొత్తకోటలో వర్షం పడుతున్న దృశ్యం

కొత్తకోట, జూన్ 7 : పట్టణంలో శుక్రవారం భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. భారీ వర్షానికి వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అర్థగంట పాటు కొత్తకోటలో భారీ వర్షం కురిసింది.

7తులాల బంగారు, 26 వేలు చోరీ

ఉండవెల్లి, జూన్ 7 : మండలంలోని అలంపూర్ చౌరస్తాలో రోజురోజుకు దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అలంపూర్ చౌరస్తాలో పండ్ల వ్యాపారం చేసుకునే ఈడిగ జ్యోతి మే 31న బంధువులు చనిపోవడంతో కర్నూలుకు వెళ్లారు. గురువారం రాత్రి 10గంటలకు వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న 7తులాల బంగారు, రూ.26వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీబస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఉండవెల్లి జూన్ 7 : ద్విచక్ర వాహనదారుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు అలంపూర్ మండలం కోనేరుకు చెందిన వీరన్న 50ఏండ్లు వ్యక్తిగత పనిపై కర్నూల్‌కు వెళ్లి వస్తుండగా పుల్లూరు టోల్‌గేట్ దగ్గరికి రాగానే ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సు పక్క నుంచి ఢీకొన్నది. దీంతో వీరన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. మృతదేహం పోస్‌మార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఖిల్లాఘణపురం, జూన్ 7 : ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి మహిళ కిందపడి కాలుపైకి బస్సు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జయిన చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం మండలంలోని మానాజీపేట గ్రామానికి చెందిన సత్యమ్మ తన కొడుకు బైక్‌పై మండల కేంద్రానికి వస్తుండగా మార్గమధ్యలో స్పీడ్ బ్రేకర్ రావడంతో బైక్ అదుపుతప్పి సత్యమ్మ కిందపడింది. ఈ క్రమంలో వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు టైరు ఆమె కాలుపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని 108 ద్వారా మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రురాలిని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆర్టీసీ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపడుతున్న పోలీసులు తెలిపారు.

డబ్బాను తగులబెట్టిన దుండగులు

దగ్ధమైన డబ్బాను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి, జూన్ 7 : జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ సమీపంలోని బీఆర్ఎస్ కార్యకర్త కొమ్ము లక్ష్మికి సంబంధించిన డబ్బాను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టినట్లు బాధితురాలు తెలిపారు. నర్సింగయ్యపల్లి 4వార్డులోని ఎంసీహెచ్ సమీపంలోని చిన్న డబ్బాలో రోగులు , బాలింతల, చిన్నపిల్లల సంబంధించిన బట్టలు సామగ్రి, జిరాక్స్ మిషన్, ఫ్రిడ్జ్ తదితర వస్తువులతో వ్యాపారం చేసుకుంటుంది. ఈ క్రమంలో గురువారం అర్థరాత్రి 12గంటల సమయంలో గురుతెలియని దుండగులు డబ్బాపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. చుట్టుపక్కల వాళ్లు గమనించి ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పట్టణ ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆస్తి నష్టం రూ.1.50 లక్షలకు పైగా ఉంటుందని, ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశీలించిన వారిలో వార్డు అధ్యక్షుడు ఈరపోగు మన్యం, బాలస్వామి, గోర్లచంద్రయ్య ఉన్నారు.

'ఉపాధి' కూలీల వేతనం పెంచాలి

కొత్తకోట, జూన్ 7 : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ముమ్మళ్లపల్లిలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. పనిముట్లకు రోజు వారీగా రూ.20లు చెల్లించాలన్నారు. కూలీలకు వంద రోజుల నుంచి 200 రోజులు పని దినాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. కార్య క్రమంలో చిన్న శేషన్న, రాములు, రాధ,శారద, ఇంద్రభా రతి పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వే చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్నవనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

- **అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**

వనపర్తి, జూన్ 7 : జిల్లాలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ మొబైల్ అప్లికేషన్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కుటుంబాలకు మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి, ఎంతా మోతాదులో వస్తున్నాయి, ఇంకా నల్లా కనెక్షన్లు లేని కుటుంబాలు ఎన్ని అనే వివరాలను తెలుసుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సర్వే పారదర్శకంగా పూర్తిచేయాలని, మున్సిపాలిటీల్లో ఎక్కువ కనెక్షన్లు ఉంటే ఇంట్లో సభ్యుల వివరాలను ఎంట్రీ చేయాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ మేఘారెడ్డి, ఇన్‌చార్జి డీఆర్డీవో నాగేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి రమణ మూర్తి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎఫ్ఎలు, పంచాయతీ కార్యదర్శులు సీసీలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి

మల్దకల్, జూన్ 7 : మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేపై ఎంపీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి అధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఫిల్డ్ అసిస్టెంట్లు, మహిళ సంఘాల బుక్‌కీపర్లకు, సీసీలకు శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గట్టు, కేటీదొడ్డి ఎంపీవో ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీవోలు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటి వారు వాడుతున్నారా లేదా అనే విషయాలపై గుర్తించాలన్నారు. నల్లా లేకుంటే వారి వివరాలను కూడా సేకరించాలన్నారు. ప్రతి ఒక్క అధికారికి 500 కుటుంబాలను సర్వే చేయడా నికి కేటాయించామన్నారు. సమావేశంలో మల్దకల్, కేటీదొడ్డి, గట్టు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, మహిళా సంఘాల బుక్ కీపర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కాలనీలోని సమస్యలను పరిష్కరించాలి

- **జెడ్పీ చైర్మన్, కలెక్టర్లకు వినతిపత్రాలను అందజేసిన కాలనీవాసులు**

సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వనపర్తి, జూన్ 7 : జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట, చిట్యాల రోడ్డు మార్గంలో నిర్మించిన డబుల్ బె డ్రూం ఇండ్ల కాలనీల్లో సమస్యలను, వాటిని పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డికి కాలనీవాసులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నమన్నారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి పూట బయటికి రావాలంటే ప్రమాదకరంగా మారిందన్నారు. తాగడానికి మంచినీటి సౌకర్యం లేదని, సీసీ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, పారిశుధ్యం పనులు జరగడం లేదని వాపోయారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పనులు చేపట్టలేకపోయారని, కనీసం ఇప్పుడైనా వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ మీడియా కన్వీనర్ అశోక్, స య్యద్ జమీల్ కాలనీవాసులు నాగమ్మ, సుజాత, అరుణ, రమేశ్, సుధాకర్‌రెడ్డి, మండ్లరాజు, సాయిలీల, మునీరుద్దీన్, శ్రీనివాసులు, వినోద్‌గౌడ్, రాజేశ్వరి, జమీల్ పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణతో శారీరక దృఢత్వం

తైక్వాండో సర్టిఫికెట్లతో విద్యార్థులు, మాస్టర్లు

అయిజ, జూన్ 7 : తైక్వాండో శిక్షణతో విద్యార్థులు శారీరకంగా దృఢత్వం కలిగి ఉంటారని మాస్టర్లు మధుకుమార్, షేక్షావలి ఆచారి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మే 1 నుంచి 31 వరకు శిక్షణ తీసుకున్న 100మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. తైక్వాండో క్రీడల వల్ల బాలబాలికలు మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉంటుందన్నారు. ప్రతివిద్యార్థి క్రమశిక్షణతో శిక్షణ తీసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పోటీల్లో మెడల్స్ సాధించాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు

వనపర్తి టౌన్, జూన్ 7 : ఈనెల 12వ తేదీ ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు పా ఠ్యపుస్తకాలను అందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగం గా జిల్లావ్యాప్తంగా 2,73,601 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటికే 2,55,690 చేరాయి. కేవలం 17వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉన్నాయి. పాఠ్యపుస్తకాలను జిల్లా యూనిట్ నుంచి ఎంఈవో కార్యాలయం మండల పాయింట్ వరకు చేర్చారు. అదేవిధంగా జిల్లాలో 6వ తరగతి ఇంగ్లిష్ , 9,10 తరగతులకు హిందీ పుస్తకాలు, 2-5వ తరగతి వరకు గణితం వర్క్‌బుక్, పదోతరగతి అభ్యాసక దీపికలు రావాల్సి ఉంది. ఈ సందర్భంగా జిల్లా యూనిట్ పుస్తక భాండాగార అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ కేవలం వర్క్‌బుక్స్, అభ్యాసన దీపికలు మాత్రమే రావాల్సి ఉన్నాయని, ఇవికూడా రెండు, మూడు రోజుల్లో జిల్లా కేంద్రానికి రానున్నాయన్నారు.

పాఠ్య పుస్తకాలు అందించాలి

మల్దకల్, జూన్ 7 : పాఠశాలలు ప్రారంభ రోజునే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందించాలని ఎంఈవో సురేశ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలో చదివే విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి గానూ పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు శుక్రవారం అందజేశారు.

ధరూర్‌లో యూనిఫాంలను ఎంఈవోకు అందజేస్తున్న సిబ్బంది

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

ఖిల్లాఘణపురం, జూన్ 7 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పెండింగ్ పనులను పాఠశాలలు పునఃప్రారంభం కల్లా పూర్తిచేయాలని ఎంపీడీవో వెంకటాచలం అన్నారు. మండలంలోని అగారం గ్రామ పాఠశాలను శుక్రవారం సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు.

ఎంఈవోకు యూనిఫాంలు అందజేత

ధరూర్, జూన్ 7 : పాఠశాల విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంలను మండల మహిళా సమాఖ్య సభ్యులు ఏపీఎం శోభారాణి ఆధ్వర్యంలో ఎంఈవోకు అందజేశారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఎంఈవోకు అందజేసి మిగతా దుస్తులను త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు నవీన్, జయరాజ్, శేఖర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి సూగూరు ఉర్సు

ఉత్సవాలకు సిద్ధమైన సూగూరు దర్గా

పెబ్బేరు, జూన్ 7: పెబ్బేరు మండలం సూగూరులో హజ్రత్ సయ్యద్ సైఫోద్దిన్‌షా ఖాద్రీ ఉర్సు శనివారం నుంచి ప్రారంభమవుతున్నది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలు జరిగే దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు.

10 నుంచి సదరం స్లాట్ బుకింగ్

వనపర్తి, జూన్ 7: జిల్లాలో సదరం సరిఫికెట్లు కొత్తగా, రెన్యువల్ కోసం అర్హులైన దివ్యాంగులు జూన్ నెలకు సంబంధించి సదరం స్లాట్ బుకింగ్ ఈ నెల 10వతేదీ సాయంత్రం 4 గంటల నుంచి చేసుకోవాలని శుక్రవారం జిల్లా మెడికల్ బోర్డు సూపరింటెండెంట్ అధికారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసుకొని సూచించిన తేదీల్లో వనపర్తి జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానలో సంబంధిత వైద్యులతో వికలత్వ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని అర్హులైన వారు సదరం సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. సదరం శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్, మీ సేవ రసీదు , ఎక్స్‌రే, మెడికల్ రిపోర్ట్స్, చెవి వినికిడి సదరం క్యాంపునకు వచ్చే వారు BERA రిపోర్ట్స్, పాత సదరం సర్టిఫికెట్లు పాస్ ఫొటో తీసుకొని రావాలని సూచించారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

ఆత్మకూరు, జూన్ 7: ప్రతి శుక్రవారం పట్టణంలో డ్రై డే ను పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీ యాదవ్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో డ్రైడే నిర్వహించారు. వార్డు పరిధిలో ఉన్నటువంటి మురుగుకాల్వవల్లో పారిశుధ్యం, కంప చెట్లు, చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికోసారి పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బిడ్డ ఆరోగ్యం తల్లిచేతుల్లోనే

అలంపూర్, జూన్ 7 : పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం తల్లి చేతుల్లోనే ఉంటుందని మండల వైద్యాధికారిణి ప్రసూనారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని క్యాతూర్ ఆరోగ్యకేంద్రంలో గర్భిణులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత, బీపీ షుగర్, ఆహారపు అలవాట్లు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ దవాఖనలోనే మెరుగైనవైద్య చికిత్సలతో పాటు సాధరణ కాన్పులు చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమం లో ఆ రోగ్య విస్తరణ అధికారి లక్ష్మీకాంత్, ఆరోగ్యసిబ్బం ది, ఏ ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.10వేలు విరాళం

మదనాపురం, జూన్ 7 : మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు గోపిస్వామి అన్నారు. గ్రామానికి చెందిన బందెల రాములు శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రజిత్ కుమార్‌కు రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సాంబశివుడు, కృష్ణకుమార్, నితిన్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

అమరచింత, జూన్ 7 : మానవ మనుగడకు జీవనాధారమైన మొక్కలను ప్రతి ఒక్కరూ నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వ దవాఖాన డాక్టర్ రూపశ్రీ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దవాఖాన ఆవరణలో ఆరోగ్య సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పచ్చదనం పరిరక్షణకు నడుం కట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రాహేళమ్మ, శారద, వెంకటేశ్వరమ్మ, హేమలత తదితరులు ఉన్నారు.